వైద్య విద్యపై కూటమి సర్కార్ కక్ష



వైద్య విద్యపై కూటమి సర్కార్ కక్ష కట్టడంతో పేద విద్యార్థులు డాక్టర్ వృత్తికి దూరం కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలతో పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారనుంది. ఐదు మెడికల్ కళాశాలలను ఈ ఏడాది ప్రారంభించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు వచ్చే ఏడాది ప్రారంభించాల్సిన ఏడు మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలిపి వేయడంతో విద్యార్థుల భవిష్యత్ అంధకారం కానుంది. రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించి 1,750 ఎంబీబీస్ సీట్లు విద్యార్థులు కోల్పోనుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
-కోవెలకుంట్ల/బేతంచెర్ల/బనగానపల్లె రూరల్

పేద పిల్లల జీవితాలతో చెలగాటమాడొద్దు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులను సైతం డాక్టర్లు చేయాలన్న తలంపుతో మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చింది. మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద పిల్లలకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నింది. ఈ ఏడాది ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించి 700 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేయాల్సి ఉంది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు వద్దని రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాయడం సమంజసం కాదు. -పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్, కోవెలకుంట్ల

భవిష్యత్తుపై ఆందోళనగా ఉంది



రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అధిక సంఖ్యలో రానున్నాయని తెలిసి ఎంతో సంతోషపడ్డాను. ప్రభుత్వ కళాశాల అయితే ఫీజులు తక్కువగా ఉంటాయి. స్థానికంగానే వైద్య వృత్తి చేసే అవకాశం దొరుకుతుంది. ఈ ఆలోచనతోనే నీట్‌కు సిద్ధమవుతున్నాను. కూటమి అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలిపివేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ఆలోచన చేస్తుండడం వల్ల ఆందోళనగా ఉంది. పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునఃసమీక్షించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. -కానాల షేక్ అష్రఫ్, నీట్ విద్యార్థి, బనగానపల్లె

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



జానాభాకు అనుగుణంగా వైద్యుల సంఖ్య పెరగాల్సి ఉంది. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగిన క్రమంలో గత ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలను తీసుకొచ్చింది. ఆ కళాశాలలను ప్రైవేటు పరంకాకుండా ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తే బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. పేదలకు వైద్య విద్య భారం కాకూడదు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలి. చేతనైతే గత ప్రభుత్వం కంటే మెరుగైన అభివృద్ధి పనులు చేయాలే గాని రాజకీయ కక్షలతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు. -అజాంబేగ్, ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి

పేదలకు వైద్య విద్యను దూరం చేయొద్దు



ఉన్నత వైద్య విద్యను సామాన్యులకు దూరం చేయవద్దు. దూరం చేస్తే ప్రభుత్వం పతనం తప్పదు. ప్రభుత్వానికి వైద్య విద్యపై చిత్తశుద్ధి ఉంటే నిబంధలను సడలించి ప్రస్తుత జానాభాకు అనుగుణంగా వైద్య సీట్లను పెంచాలి. తద్వార గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కళాశాలను అందుబాటులోకి తీసుకునిరావాలి. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని విద్యార్థులు, పేదలకు అన్యాయం చేయడం సరికాదు. -భార్గవ్, సీపీఎం మండల కార్యదర్శి, బేతంచెర్ల

క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఏడీ బాధ్యతల స్వీకరణ


సతీష్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా సతీష్‌కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ట్రాన్స్‌కో ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ ఏడీగా పనిచేసిన ఖాజావలి తిరుపతికి బదిలీ కాగా ఆ స్థానంలో నంద్యాల రూరల్ ట్రాన్స్‌కో కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న సతీష్‌కుమార్‌రెడ్డిని బదిలీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. నూతన ఏడీకి ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్: స్వామి వివేకానంద చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో ప్రసంగించి 130 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను తన వాక్‌చాతుర్యంతో ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానంద జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఓబులరావు, శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్, చౌడప్ప, రాజలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఓడీ అంజన్‌ప్రకాష్

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం అల్ట్రాటెక్ సిమెంట్ సీఎస్ఆర్ హెచ్‌ఓడీ అంజన్ ప్రకాష్ ప్రారంభించారు. సుమారు పదేళ్ల క్రితం సీఎస్ఆర్ నిధులతో ప్లాంట్ ఏర్పాటు చేసినా అనివార్య కారణాలతో నిరుపయోగంగా మారింది. గ్రామంలో మినరల్ వాటర్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. గ్రామస్తుల కోరిక మేరకు వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి పునరుద్ధరించారు. నీటి సౌకర్యం అందుబాటులోకి రావడంతో ప్రాథమిక పాఠశాల సమీపంలోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం


పల్లకీలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు పుష్పాలంకరణ శోభితుడైన స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ ప్రధాన అర్చకులు మద్దిలేటి స్వామి, నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం


మొక్కలు నాటుతున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం అని గీతాయోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, పారిశ్రామికవేత్త గోవిందరెడ్డి, స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీసీంగుంతల మధు అన్నారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీదేవి, రహంతుల్లా, సామాజిక కార్యకర్తలు మమ్మద్ రఫీ, హరినాథ్, నారాయణరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని సీతమ్మతండా గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బాలునాయక్, భాగ్యలక్ష్మి దంపతులు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. డిక్షనరీలు, అట్టలు, పెన్నులు, వ్యాకరణ, గణిత పుస్తకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహన తనిఖీ చేస్తున్న ఎంవీఐ

బేతంచెర్ల: ప్రమాదాల నిర్మూలనకు వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని, అధిక లోడుతో వెళ్తున్న, టాక్స్ చెల్లించని 7 వాహనాలపై కేసులు నమోదు చేశారు. రూ.1,53,440 జరిమానా విధించారు. వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్‌తో పాటు లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

పంట నమోదుకు రెండు రోజులే అవకాశం


మిరప పంటను పరిశీలిస్తున్న ధరణి

కొలిమిగుండ్ల: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పక చేయించుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి ధరణి సూచించారు. శుక్రవారం బి.ఉప్పలూరు, బి.తాడిపత్రి గ్రామాల్లో మిరప, చీని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. ఈనెల 15వ తేదీతో పంట నమోదు కార్యక్రమం ముగుస్తుందని, రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రాయితీ పథకాలకు అర్హులవుతారని పేర్కొన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిరప, చీని రైతులకు పలు సూచనలు అందించారు.

ఈకేవైసీ తప్పనిసరి

బనగానపల్లె రూరల్: రైతులు సాగు చేసిన పంటలను ఈకేవైసీ ద్వారా ఈ-క్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఈకేవైసీని పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించు కోవాలన్న, క్రాప్ ఇన్సూరెన్స్, నష్టపరిహారం వర్తించాలన్నా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత


ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బందికి అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని.. నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 19,500 మంది ఉన్నారని..వీరికి ఈ నెల 17న జాతీయ నులిపురుగుల దినోత్సవం రోజున ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా మింగించాలని సూచించారు. 1 నుంచి 2 సంవత్సరాల్లోపు పిల్లలకు సగం మాత్ర సరిపోతుందని.. మిగిలిన వారు పూర్తి మాత్రను భోజనం తరువాత వేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీహెచ్ఈఓ ఎన్. వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ అయ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎన్ఎం నాగలక్ష్మి సీఆర్‌పీలు సుధాకర్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

22న వాల్మీకుల జాగృతి సమావేశం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వాల్మీకి సంఘం నేతలు

డోన్: కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్న వాల్మీకి జాగృతి వర్క్‌షాప్‌లో వాల్మీకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతినాయుడు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, బాల మద్దిలేటి కోరారు. శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఇందు కోసం వాల్మీకులంతా ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీధర్, మోహన్, శివ, కళ్యాణ్‌రాముడు, సురేంద్ర, మాధవక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్యాపిలి: వాల్మీకులను ఎస్టీలో చేర్చే విషయమై ఈ నెల 22వ తేదీ కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి, బోయ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటి తెలిపారు. శుక్రవారం ప్యాపిలిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వాల్మీకుల సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వాల్మీకులు హాజరుకావాలని కోరారు. రామదాసు, శ్రీధర్, శివ, మోహన్, కళ్యాణరాముడు, సురేంద్ర, మాధవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్య వస్తే సమాచారం ఇవ్వండి


వైద్యులతో మాట్లాడుతున్న సీఐ ఇంతియాజ్‌బాషా

డోన్ టౌన్: ఇటీవల కాలంలో వైద్యులు, సిబ్బందిలపై దాడులు జరగడం బాధాకరమని.. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు, గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో శుక్రవారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై ఆరాచకాలు ఎక్కువ అయ్యాయని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుకోని ఇబ్బందులు, సమస్యలు తలెత్తితే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వచ్చే మెసేజ్‌లపై అనుమానం వస్తే తక్షణమే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డాక్టర్లు మాధవకృష్ణ, సుంకన్న, బాలచంద్రారెడ్డి, రాజశేఖర్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ముస్కీంవలి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


పల్లకీపై భక్తులకు దర్శనమిస్తున్న చౌడేశ్వరిదేవి

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవను శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి సంప్రదాయబద్ధంగా ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: ప్యాపిలి 33 కేవీ ఫీడర్‌లో నిర్వాహణ పనుల కారణంగా యూ కొత్తపల్లె, దేవరబండ సబ్‌ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇస్తామన్నారు. అలాగే చిన్నమల్కాపురం 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా చిన్న మల్కాపురం, ఆర్ఎస్.రంగాపురం, గూటుపల్లె సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

ప్రణాళికతో చదివితే విజయం సొంతం

కోవెలకుంట్ల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సంటిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే

డోన్ రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక కోట్ల స్టేడియంలో శుక్రవారం క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పేరు, ప్రతిష్టలు తీసుకునిరావాలని సూచించారు. పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్ యాదవ్, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, నారాయణ, దాస్, నగేష్, సునిత, చంద్ర, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేద్దాం

డోన్ టౌన్: నంద్యాలలో ఈ నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే రవాణా కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, సహాయ కార్యదర్శి శివరామ్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సదస్సుపై సమావేశం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డ్రైవర్ల జీవితంతో చెలగాటం ఆడే భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్(1)(2)లను రద్దు చేయాలని కోరారు. రవాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఈ నెల 28,29,30 తేదీల్లో నంద్యాలలో రాష్ట్ర సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎండిపోయిన వందేళ్ల వేప చెట్టు


ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్టు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయానికి చెందిన వందేళ్ల పైబడి వేప చెట్టు పూర్తిగా ఎండిపోయింది. పచ్చగా కళకళలాడుతున్న చెట్టు ఒక్కసారిగా ఎండిపోవడంతో ప్రధాన రహదారిలో శోభ కోల్పోయింది. దశాబ్దాల క్రితం నుంచే స్థానికులు ఈ వేపచెట్టును అమ్మవారిగా భావించి నిత్యం పూజలు చేస్తుండేవారు. ఇక్కడే జ్యోతులు నిర్వహిస్తుండేవారు. కాలక్రమేణా చెట్టు వద్దనే చౌడేశ్వరిదేవి ఆలయాన్ని నిర్మించారు. వేపచెట్టును భక్తులు సెంటిమెంట్‌గా భావిస్తుండేవారు. చెట్టు ఎండిపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి చెంతనే భారీ వృక్షం ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. పెనుగాలులు వీస్తే పడిపోయే ప్రమాదముంది. గ్రామపెద్దలు, అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు


డోన్: ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



బేతంచెర్లలో..

డోన్ టౌన్/ డోన్ రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశ రాజకీయాలకు తీరని లోటని సీపీఎం నాయకులు ఎల్లయ్య, నరసింహులు, శివరామ్, భాస్కర్‌రెడ్డి, కొండన్న అన్నారు. శుక్రవారం డోన్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి ఉన్నత కుటుంబంలో పుట్టినా పేదల అభ్యున్నతి కోసం ఉద్యమబాట పట్టారని అన్నారు. ఎంపీగా, పత్రికా సంపాదకుడిగా ఎంతో సేవ చేశారని కొనియాడారు. సీపీఎం నాయకులు నక్కిశ్రీకాంత్, కోయికొండ నాగరాజు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టి, షేబారాణి, సురేంద్ర, రామమద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నక్కిరామన్న భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, నాయకులు నారాయణ, పి.సుంకయ్య, వెంకటేశ్వర్లు, షమీమ్ నివాళులర్పించారు.

- డోన్: స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. పెన్షనర్స్ సంఘం సభ్యులు గాలయ్య, శ్రీనివాసులు, గోపాల్, రాందాస్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.
- బేతంచెర్ల: స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎల్లయ్య, సాధిక్ నివాళులర్పించారు.
- అవుకు: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ నాయకులు ర్యాలీగా వచ్చి ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు పరిశోధనల కోసం దానం చేయడం గొప్ప విషయమని అన్నారు. నాయకులు బాల ఉశేని, వెంకటేశ్వర్లు, నాగాంజనేయులు, రమేష్, నమ్య నాయక్ పాల్గొన్నారు.
- కోవెలకుంట్ల: సీపీఎం నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాబు ఉసేన్, త్యాగరాజు, తిరుపాలు, అచ్చమ్మ, మద్దమ్మ పాల్గొన్నారు.

రైళ్ల సర్వీసులు పొడిగించాలని వినతి

కోవెలకుంట్ల: నంద్యాల-ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రస్తుతం నడుస్తున్న రైలు సర్వీసులను మరి కొన్ని ప్రాంతాలకు పొడిగించాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కోవెలకుంట్లకు వచ్చిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నంద్యాల నుంచి రేణిగుంట వరకు నడుస్తున్న డెమో రైలును తమిళనాడు రాష్ట్రంలోని అరక్కోణం వరకు, మచిలీపట్నం - యశ్వంతపూర్ రైలును బనగానపల్లె, కోవెలకుంట్ల, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా నడపాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం- తిరుపతి రైలును కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె, నంద్యాల మీదుగా మళ్లించాలన్నారు. ప్రసుత్తం నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో నడుస్తున్న తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును సంజామల మండలం నొస్సం స్టేషన్‌లో స్టాపింగ్ వసతి కల్పించాలని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైళ్ల పొడిగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ ప్రసాదరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా తదితరులు ఉన్నారు.

రోడ్లను కప్పేస్తున్న కంపచెట్లు

- మలుపుల వద్ద ప్రమాదకరం


కస్తూర్బా స్కూల్ సమీపంలోని మలుపు వద్ద పెరిగిన కంపచెట్లు


ప్రధాన రహదారిపైకి వచ్చిన పిచ్చిమొక్కలు

కొలిమిగుండ్ల: నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులను కంపచెట్లు, పిచ్చిమొక్కలు కప్పేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద పెరిగిన కంప చెట్ల వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అనంతపురం-అమరావతి 544-డీ జాతీయ రహదారి వెంట అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల, బెలుం వరకు రోడ్డు పక్కల ఓవైపు రాళ్ల గుట్టలకు తోడు కంపచెట్లు,పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈమార్గంలో రేయింబవళ్లు వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. మలుపుల సమీపంలో పెరిగిన కంపచెట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. మీర్జాపురం, ఇటిక్యాల నుంచి చింతలాయిపల్లె తదితర గ్రామాల రహదారుల్లో సైతం కంపచెట్లు పెరిగిపోయాయి. వాహనదారులు భయంతో రాక పోకలు సాగిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ప్రధాన రహదారుల వెంట పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.